



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు



సమస్యలపై.. వాడీవేడి చర్చ..!

- గత ప్రభుత్వ పాలనపై టిడిపి ఎమ్మెల్యేల ప్రశ్నల వర్షం
- పింఛన్లపై టిడిపి, వైసిపి సభ్యుల వాదోపవాదాలు
- కొందరు అధికారులు అవినీతికి పాల్పడ్డారు.. : జెడ్పీ చైర్‌పర్సన్
- అవినీతిపై విచారణ జరిపిస్తాం : కలెక్టర్
- ప్రశ్నలు.. సమాధానాలతో సాగిన జెడ్పీ సమావేశం

ప్రజాశక్తి - అనంతపురం అర్బన్

174 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో జెడ్పీలో కాస్తా భిన్న పరిస్థితులు కన్పించాయి. గతంలో అందరూ సభ్యులు వైసిపి వారే ఉండేవారు. ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండడంతో సమాశం వాడీవేడిగా సాగింది. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం జడ్పీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జెసి.అస్మిత్ రెడ్డి, ఎంఎస్.రాజు, పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, కందికుంట వెంకటప్రసాద్, అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి తదితరులు పాల్గొన్నారు.



అంబికా లక్ష్మీనారాయణ



కాలవ శ్రీనివాసులు



అమిలినేని సురేంద్రబాబు

పింఛన్లపై వాదోపవాదాలు

ఎన్డీఏ కూటమిలో పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమయంలో కొందరు వైసిపి జడ్పిటిసిలు టిడిపి అధికారంలోకి వచ్చాక కొన్ని పింఛన్లు తొలగించారని, దీని వల్ల లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ విషయాన్ని హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి ఖండించారు. వైసిపి జెడ్పీటీసీల వాదనను తిప్పికొట్టారు. ఈ సమయంలో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. వాలంటీర్ల విషయంపై ఎన్నికల్లో వైసిపికి పనిచేసిన వాలంటీర్లతో పనిచేయచ్చుకోవాల్సిన అవసరం తమకు లేదని టిడిపి ఎమ్మెల్యేలు తెలిపారు. గతం కంటే మిన్నగా అర్హులందరికీ ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంచామని తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజులు సమాధానం ఇచ్చారు. వైసిపికి పని చేసిన వాలంటీర్లతో తాము ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసేది లేదని స్పష్టం చేశారు.



పల్లె సింధూరరెడ్డి



దగ్గుపాటి ప్రసాద్



బండారు శ్రావణిశ్రీ



ఎంఎస్.రాజు

ప్రొటోకాల్‌పై వివాదం

సభ్యులు, ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారంటూ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు అధికారులు గౌరవం ఇవ్వాలన్నారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. దీనిపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ తెపారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు సమస్యలపై ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు.

'గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం'

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత ఐదేళ్లుగా అభివృద్ధి పడకేసిందని టిడిపి ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అభివద్ధి కేవలం కాగితాలకే పరిమితం అయ్యిందని విమర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. కరువు జిల్లాగా పేరుగాంచిన అనంతపురం జిల్లాలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం కేవలం మాటలతోనే సరిపెట్టిందన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో పలువురు వైసిపి శాసనసభ్యులు గ్రామాలకు వెళ్లే తాగునీటి పైపులను తమ బోరుబావులకు మళ్లించుకున్నారని ఆరోపించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కృష్ణా జలాల బోర్డును రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరగా దీనికి హిందూపురం ఎంపి బికె.పార్థసారథి మద్దతు తెలిపారు.

అధికారులు అవినీతికి పాల్పడ్డారు... జెడ్పీ ఛైర్‌పర్సన్

గత ప్రభుత్వంలో నిధులు సక్రమంగా మంజూరు కాలేదని అందువల్లే అభివృద్ధి పనులు జరగలేదని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ విషయమై జెడ్పీ పర్సన్‌బోయ గిరిజమ్మ జోక్యం చేసుకుని మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు సక్రమంగా బిల్లులు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అప్పుడు విధులు నిర్వహించిన జెడ్పీ సిఇఒ, డిప్యూటీ సిఇఒలు అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో నిధులు మంజూరు చేసినా, సంబంధిత అధికారులు పనులు చేయలేదన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు.

విచారించి చర్యలు తీసుకుంటాం.. : కలెక్టర్

ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిర్ణయాలను పాటిస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన పనులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై తనకు నివేదిక ఇవ్వాలంటూ జెడ్పి సిబ్బంది, ఛైర్‌పర్సన్‌కు సూచించారు. ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించాలన్నారు. జిల్లా ప్రజా పరిషత్‌లో ఇప్పటివరకు జరిగిన ప్రతి అంశంపై నివేదిక తీసుకుని విచారించి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు కొన్ని పూర్తి చేసుకుని, మరికొన్ని అసంపూర్తిగా నిలిచిపోయాయని చెప్పారు.

ప్రజా సమస్యలపై చర్చించేరా..?

నాలుగు నెలలు తర్వాత కదిరి కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-కదిరి టౌన్

నాలుగు నెలల తర్వాత కదిరి మున్సిపల్ సమావేశం బుధవారం నాడు జరగనుంది. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సమావేశం జరగబోతోంది. మున్సిపాలిటీ పరిధిలో తిష్ట వేసిన సమస్యలపై నేడు జరగనున్న సమావేశంలో ప్రజా సమస్యలు చర్చకు వచ్చేనా అని పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత నాలుగు మాసాలుగా మున్సిపల్ సాధారణ సమావేశం జరగపోవడం తో మున్సిపాలిటీ పరిధిలో అభివద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నా చందాన తయారైంది. గతంలో రాష్ట్రంలో వైసిపి అధికారంలో ఉండి, కదిరి మున్సిపాల్టీ పాలకవర్గం పీఠం వైసిపి చేతిలో ఉన్నా పట్టణ అభివద్ధి అనుకున్న మేర జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికలలో వైసీపీ పరాజయం చెంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరు కానున్నారు. ఎమ్మెల్యే కందికుంట పట్టణాభివద్ధిపై ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారంపై సమావేశంలో చర్చ జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది.



పట్టణంలో సమస్యల తిష్ట

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య సమస్య కన్పిస్తోంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిలేకపోవడంతో రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. వర్షపు నీరు, వ్యర్థాలు పెరిగి దోమలు పెరిగాయి. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు.

అధికారుల అవినీతి బాగోతంపై చర్చ జరిగేనా .?

కదిరి మున్సిపాల్టీల్లో అధికారుల అవినీతిపైనా పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాల్టీలో పనిచేస్తున్న కార్మికులు వివిధ కారణాలతో మతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బీమా మంజూరు చేసేందుకు కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. ఈ అవినీతి వ్యవహారంపై ప్రజాశక్తిలో కథనాలు ప్రచురితం అయ్యాయి. వీటితో మరికొన్నింట్లోనూ అధికారుల అవినీతి పాత్ర ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరి వీటన్నింటిపే నేడు జరిగే సమావేశంలో ఏమేరకు చర్చ ఉంటోందనని ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

నత్తనడకన గ్రామీణ రహదారులు

- సత్యసాయి జిల్లాలో 21 శాతం పనులే పూర్తి
- రూ.88.02 కోట్ల బకాయి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ రహదారుల నిర్మాణపు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. సత్యసాయి జిల్లాలో నత్తనడకన పనులు నడుస్తున్నాయి. అంతకు మునుపు ఆర్థిక సంవత్సరం పనులు ఎక్కడిక్కడే అన్న చందంగా మారాయి. మొత్తం పనుల్లో 21 శాతం కూడా ఈ ఒకటిన్నర సంవత్సరం కాలంలో జరగలేదు. పనుల పురగతిపైనే ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ సమావేశంలోనూ ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం.

21 శాతమే పనులు పూర్తి

సత్యసాయి జిల్లాలో 2023-24 సంవత్సరంలో 3079 పనులు మంజూరయ్యాయి. వీటి విలువ రూ.727.13 కోట్లు విలువైన పనులు మంజూరైన వాటిల్లోనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 314 పనులు మంజూరయ్యాయి. వీటి విలువ రూ.33.81 కోట్లు ఉన్నాయి. 3393 పనులు రూ.751.54 కోట్ల విలువైన పనులు మంజూరైన వాటిల్లోనున్నాయి. ఇందులో ఇప్పటి వరకు పూర్తయిన పనులు 734. వాటి విలువ రూ.254.99 కోట్లు. అయితే ఇందులో మొత్తంగా చూసిప్పుడు ఇప్పటి వరకు పూర్తయిన పనులు 21 శాతం మాత్రమే. ఇందులో అత్యధికంగా పూర్తయినవి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సిసి రహదారులున్నాయి.

రూ.88.02 కోట్లు బకాయిలు

మొత్తం చేసిన పనుల్లోనూ అత్యధికం



బిల్లులు బకాయిలుండటం గమనార్హం. 2023-24 సంవత్సరంలో రూ.254.99 కోట్లు పనులు చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.58.06 కోట్లు కలిపి మొత్తం రూ.313.06 కోట్లు పనులున్నాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.88.02 కోట్లు బకాయిలున్నాయి. అత్యధిక బకాయి ఉన్న పనుల్లో ఎపిఆర్ఆర్‌పి పనులు చేపట్టిన వాటిల్లో బకాయిలు రూ.22.73 కోట్లు. ఎఎంసి రహదారుల చేసిన పనులు రూ13.22 కోట్లు, సిసి రహదారులు రూ.19 కోట్లు. బిటి రహదారులు రూ.8.14 కోట్లు ఇలా అన్ని కలిపి రూ.88 కోట్లు బకాయిలున్నాయి.

పాత బకాయి బిల్లులు అయ్యేనా ?

వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన బిల్లులకు ఇప్పుడు ఈ ప్రభుత్వం ఏ మేరకు బిల్లులు మంజూరు చేస్తుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఎన్నికల ఫలితాల తరువాత నుంచి బిల్లులు ఆప్‌లోడ్ చేసేందుకు కూడా వీల్లేకుండా ఆన్‌లైన్‌లో ఆప్షన్ లేకుండాపోయిందని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అనేక శాఖల్లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. అంతకు మునుపు 2019లో వైసిపి ప్రభుత్వమొస్తూనే టిడిపి నాయకులకు సంబంధించి బిల్లులు చెల్లింపులను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పెండింగ్‌లో పెడితే తమ పరిస్థితి ఏమిటని పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపిజయచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోని మున్సిపల్ ఉన్నతపాఠశాలలో మంగళవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్య, నూతన అప్‌గ్రేడ్ అయిన ఉన్నతపాఠశాలల పోస్టుల మంజూరు, బదిలీలు, ప్రమోషన్లు, మున్సిపల్ పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను అనుగుణం గా పోస్టుల సర్దుబాటు చేయాలన్నారు. జీవో నెంబర్ 117 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటిసభ్యులు రామకష్ణనాయక్, ధర్మవరం యూటీఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరికృష్ణ, సాయిగణేశ్, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, హరిశంకర్, ఆంజనేయులు. మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు 'హరీష్' విద్యార్థులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుక్క పట్నం మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి బాలుర పాఠశాలలో ఉమ్మడి అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగిందన్నారు. ఈ ఎంపికకు ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నెలలో గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనన్నున్నట్లు చెప్పారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న సాయి గణేష్, పి. నవీన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని ప్రిన్సిపల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్ వలీ, ప్రసన్న కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.




ప్రతిభా విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

జాతీయ స్థాయిలో 'పురం' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఫార్మసీ విద్యార్థిని ఎస్. ఫాతిమా జోహ్రా కు డిప్లమో ఇన్ ఫార్మసీ విభాగంలో దేశ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కేకే ఆచార్జీ అవార్డుల ప్రదానంలో ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతియేటా దేశస్థాయిలో డిప్లమో ఇన్ ఫార్మసీ విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కేకే ఆచార్జీ అవార్డు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఇందులో 2023 విద్యా సంవత్సరానికి గాను 2019/2100 (96.14శాతం) మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన ఫాతిమా జోహ్రాకు హైదరాబాదులో ఈ నెల 5 నుండి 7 వరకు జరిగిన 73వ ఐపిసి-2024 కాన్ఫరెన్స్ నందు కేకే ఆచార్జీ అవార్డులో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అవార్డు కింద ఆమెకు కు రూ.5 వేల నగదు, జ్ఞాపికను ఇండియన్ హాస్పిటల్ ఫార్మసిస్ట్ అసోసియేషన్, న్యూఢిల్లీ బహుకరించినట్లు తెలిపారు. వరుస సంవత్సరాలలో స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఫార్మసీ విభాగం నుండి దేశ స్థాయిలో పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఫాతిమా జోహ్రా పేద కుటుంబం నుంచి వచ్చినా, చదువు పట్ల తనకున్న మక్కువ చూసి తనని ఉన్నత చదువులు చదివిస్తున్న తండ్రి కష్టాన్ని అర్థం చేసుకుని దేశస్థాయిలో కళాశాల కీర్తీ పతాకాలను ఎగరవేసిందన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన కళాశాల సిబ్బందికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసాపత్రం అందుకుంటున్న పాతిమాజోహ్రా

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలోని శ్రీ సీతారామ దేవాలయంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నరసింహమూర్తి, అధ్యక్షులుగా మంజునాథ్, ప్రధానకార్యదర్శిగా చంద్ర, ఉపాధ్యక్షులుగా నగేష్, హర్షిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా హరీష్ కుమార్, ఎం.నవీన్, జాయింట్ సెక్రటరీగా మంజు, రమేష్, ప్రచార కార్యదర్శిగా మంజునాథ్, ప్రేమ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నాయి బ్రాహ్మణ టిడిపి సాధికార సమితి సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ గంగాధర్, రాయలసీమ కన్వీనర్ బెలుగుప్ప ధనుంజయ్, జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్, రామకృష్ణ, జంబల బండి రామాంజనేయులు, అక్కమ్మ, త్యాగరాజు, నగేష్, కదిరి రామకష్ణ, సద్దానప్ప తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో మాక్‌డ్రిల్

పుట్టపర్తి రూరల్ : ప్రమాదకర సంఘటనలు ఎదురైనప్పుడు వాటిని దీటుగా ఎదుర్కొని నిలవరించే విధానంపై డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, సిబ్బందిచే మంగళవారం శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయి విమానాశ్రమంలో ఎఆర్ డిఎస్‌పి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు సిఐ బొజ్జప్ప, ఆర్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేత మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు, బాంబు డిస్పోజల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

రైతులు తమ పొలాలకు సంబంధించి పంటల సాగులో అధిక దిగుబడుల కోసం భూసార పరీక్షలు తప్పకుండా చేయించు కోవాలని ఎఒ లోకేశ్వరరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని మేకలచేడు, ఎదురుదోన గ్రామాల్లో పర్యటించి మట్టి నమూనాల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల్లో ఉన్న భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. తద్వారా ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు చేయకుండా, భూసారాన్ని కాపాడుకుంటూ,అధిక సుస్థిర దిగుబడులను పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్‌టిబిఎస్ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల భద్రత సామాజిక బాధ్యత అని అన్నారు, బాల్య వివాహాలు, వేధింపులు నుండి వారిని కాపాడవలసిన బాధ్యత సమాజంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. కృష్ణ మోహన్ , పాఠశాల సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది శంకరమ్మ , ఆర్‌బిటి ఆదినారాయణ, బ్రాహ్మణి, ఏఆర్‌ఓ మురళీకృష్ణ , అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెద్దగువ్వల పల్లి గ్రామంలో శ్రీ వినాయక సేవా సమితి సభ్యులు గర్భిణులకు డ్రై ఫ్రూట్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు ఈ సమయంలో పౌష్టికాహారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చంద్ర శేఖర్ రెడ్డి, వినాయక సేవా సమితి సభ్యులు శ్రీనివాసులు, గోపాల్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డుల్లో టీడీపీ నాయకుల పర్యటన

ప్రజాశక్తి - సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని పలు వార్డుల్లో టిడిపి స్థానిక నాయకులు మంగళవారం పర్యటించారు. 5 వార్డు అర్బన్ కాలనీ, ఎస్సీ కాలనీ, బోయ పేట ఏరియా తదితర కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు యాదవ్, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, కౌన్సిలర్ గిరి, మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ, కె.రామాంజనేయులు, జబ్బుల్లా ఖాన్, మురళీ, త్రివేద, బాబుల్ రెడ్డి, చంద్ర, స్టుడియో సూరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మవరానికి మంత్రి రాక

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ బుధవారం ధర్మవరానికి రానున్నట్లు డీపీఆర్వో వేలాయుధం తెలిపారు. విజయవాడ నుంచి రైల్లో మంగళవారం రాత్రి 7-30గంటలకు బయలుదేరి బుధవారం ఉదయం 6-10గంటలకు అనంతపురం చేరుకుంటారన్నారు. అనంతపురం నుంచి 9-20 గంటలకు బయలుదేరి 9-50 గంటలకు ధర్మవరం చేరుకుంటారని చెప్పారు. 9-50 నుంచి సాయంత్రం 6గంటల వరకు ధర్మవరం నియోజకవర్గంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని డీపీఆర్వో పేర్కొన్నారు.

చెరువు కట్ట మరమ్మతులు ప్రారంభం


ప్రజాశక్తి - రొద్దం

టింబక్టు కలెక్టర్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చెరుకూరు గ్రామంలో చెరువు కట్ట మరమ్మతుల కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామ చెరువులో పూడిక తీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బబ్లు గంగోలి, శ్రీకాంత్, మహేష్, రమేష్, రవి, సన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్‌టిసి)కు చెందిన స్థలాన్ని టెండర్ ద్వారా లీజుకు తీసుకుని, ఆ స్థలంలో షెడ్లను వేసుకుని చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి షెడ్లను తొలగిస్తే, వారందరు రోడ్డున పడుతారని, వారికి న్యాయం చేసి ఆదుకోవాలని రాజకీయ పార్టీల ఐక్య వేదిక నాయకులు కోరారు. ఈ విషయంపై మంగళవారం ఆర్ టిసి డిపో మేనేజర్ కు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ తో వారు మాట్లాడుతు ఆర్‌టిసికి చెందిన ఖాళీ స్థలాలను నిబంధనల మేరకు టెండర్ ద్వారా ఐదుగురు లీజుకు తీసుకున్నారన్నారు. దీని ద్వారా ఆ 5 కుటుంబాలతో పాటు మరో 20 మంది అక్కడ పని చేసుకుంటు జీవనం చేస్తున్నారని చెప్పారు. అయితే మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడం పేరుతో వాటిని కూల్చాలని నోటీసులు ఇవ్వడానికి సిద్ధమయ్యారని చెప్పారు.ఉన్నఫలంగా వాటిని కూల్చితే ఉండరు రోడ్డున పడుతారని చెప్పారు. ఇప్పటికే టెండర్ ల ద్వారా తీసుకున్న ఆ స్థలానికి వేలాది రూపాయలు డిపాజిట్ చెల్లించడంతో పాటు ప్రతి నెల రూ. 80వేలు అద్దె చెల్లిస్తున్నారని తెలిపారు. ఇటువంటి వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆర్‌టిసి అధికారులపై ఉందన్నారు. నిర్మాణం చేసే సమయంలో కనిపించని అక్రమ కట్టడం సంవత్సరాలు గడిచిన అనంతరం ది. ఇక మున్సిపల్ అధికారులకు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా అని నాయకులు ప్రశ్నించారు. దీనికి సంబంధించి మున్సిపల్ అధికారులు ఆర్‌టిసి అధికారులతో చర్చించుకోవాలని, అలా కాకుండా షెడ్లను తొలగించే ప్రయత్నం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్యామ్ కిరణ్, బీఎస్పీ శ్రీరాములు, ఆర్ఎస్పీ శ్రీనివాసులు, ఎంఎస్ఎఫ్ రవికుమార్, ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ నౌషాద్, దళిత సమైక్య నాయకులు నారాయణ, కాంట్రాక్టర్ గోపాల్, ఎమ్మెల్ నారాయణ, షెడ్డు నిర్వాహకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కేసులు బనాయించడం దుర్మార్గం : వైసిపి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం అ ప్రజాస్వామ్యమని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. మండల పరిధిలోని నాగినేని చెరువు సర్పంచి కుటుంబంపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో మాజీ మంత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అనేకమంది వైసీపీ నాయకులపై కూటమి నాయకులు దాడి చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని వీరిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు ఇలాగే ప్రవర్తిస్తే దీనిపై చర్యలు తీసుకొని రోడ్డెక్కి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ వెంకట్ నారాయణ రెడ్డి, గుడిపల్లి కళ్యాణ్, జగదీష్, సర్పంచులు అంజి నాయక్, కిష్టప్ప, కంబాలప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న కోరారు. ఈ మేరకు కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ నాగ శేషాచల రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మండల వెంకటేశ, బాబు, మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - సోమందేపల్లి

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీ సర్వే నంబర్ 180లో వైసిపి కౌన్సిలర్ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ సర్వేనెంబర్‌లో అంజనమ్మ భర్త బాబయ్యకి ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని అయితే ఆస్థలంలో వైసిపి కౌన్సిలర్ శేషాద్రి పట్టా లేకుండా అక్రమంగా నిర్మాణం చేపట్టుతున్నాడని అన్నారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపాలన్న డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజుకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, బాబావలి, రాజురావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యను తహశీల్దార్‌కు వివరిస్తున్న నాయకులు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇటీవల కాలంలో వెలుగుచూస్తున్న కొత్త రకం సైబర్ నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి సూచించారు. ట్రేడింగ్ మోసాలు, హని ట్రాప్ , సైబర్ నేరాల పట్ల, ప్రజలుకు అవగాహన కల్పించే విధంగా తయారుచేసిన పోస్టర్లను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి అదనపు ఎస్పీ ఎన్ విష్ణు తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తక్కువ సమయంలో సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశను అస్త్రంగా ఏంచుకుంటున్న సైబర్ నేరగాళ్ల ప్రజలకు ఆశ కల్పించి వివిధ రూపాలలో మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ, ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సోషల్ మీడియా , సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ హేమంత్ కుమార్, డిసిఆర్‌బి సిఐ శ్రీహర్ష, ఆర్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి - సోమందేపల్లి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని మండ్లి, జూలూకుంట, సోమందేపల్లి ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో సుధాకర్, స్థానిక నాయకులతో కలసి యుటిఎఫ్ సభ్యత్వాలను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను విచ్చిన్నం చేస్తున్న జీవో నెంబర్ 117 వెంటనే రద్దు చేసి 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోకి విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ, లక్ష్యాలతో కొనసాగుతున్న యుటిఎఫ్ స్థాపించబడి 50 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను ఉపాధ్యాయులంతా బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణ స్వామి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అశ్వర్థ నారాయణ, లక్ష్మా నాయక్ , రామకృష్ణ నాయక్, సోమశేఖర్, హనుమంతు నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు



సభ్యత్వనమోదులో నాయకులు, ఉపాధ్యాయులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య అధికంగా ఉందని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జిల్లా త్రాగునీటి అధికారులను కోరారు. మంగళవారం నిర్వహించిన అనంతపురం జిల్లా సర్వ సభ్య సమావేశంలో పలు సమస్యలపై ఎమ్మెల్యే పల్లె సింధూర చర్చించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గంలో నల్లమాడ, ఓడి చెరువు, అమడుగురు ,కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లో త్రాగునీటి సమస్య ఉందని వెంటనే సమస్య పరిష్కారం చూపాలని ఆమె కోరారు. నల్లమడ మండలం చౌటకుంటపల్లి, సుబ్బరాయనపల్లి ,ఓడి చెరువు మండలం నాయనవారిపల్లి కమ్మవారిపల్లి, వేమారెడ్డి పల్లి సమీపంలో ప్రభుత్వం నిర్మించిన గృహ నిర్మాణ కాలనీలో త్రాగునీటి వసతి లేదని, పుట్టపర్తి మండలం బీసీ కాలని, బత్తల పల్లి తదితర గ్రామాల్లో వెంటనే త్రాగునీటి పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను ఎమ్మెల్యే కోరారు.




జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర

అక్రమ కేసులు ఎత్తేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఐక్య వేదిక నాయకులు కెఆర్ సూర్యనారాయణ పై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి. భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం పట్టణంలోని గోకులం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం పోరాడిన రాష్ట్ర అధ్యక్షుడిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు.ఉద్యోగ కార్మిక ఉపాధ్యాయ వర్గాలలో ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం ప్రవర్తించిందని విమర్శించారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం కృషి చేసిన అధ్యక్షునిపై ఉన్నత అధికారులు సైతం అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచారన్నారు. వెంటనే అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ లో డిఆర్ఒ కొండయ్యకు వినతిపత్రం సమర్పించారు. తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గోవిందప్ప, హేమే నాయక్, గోపి, పుట్టపర్తి తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, కదిరి తాలూకా అధ్యక్షులు ఫక్రుద్దీన్, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం తాలూకా అధ్యక్షులు రవీంద్ర రెడ్డి, వన్నప్ప, అబ్దుల్ ఖాదర్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డిఆర్ఒ కొండయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగసంఘం నాయకులు

నేరాలు ఘోరాలు

మద్యం దుకాణంలో చోరీ

రూ.2.40 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం రాయచోటి రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పట్టణ సిఐ పుల్లయ్య తెలిపిన వివరాల మేరకు ప్రభుత్వ మద్యం దుకాణం లో సూపర్వైజర్ గా పనిచేసే ఋషివర్ధన్ మంగళవారం ఉదయం వెళ్లి దుకాణం తెరవగా చోరీ చోటు చేసుకున్నట్లు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారించారు. దుకాణంలో రూ. 2.40 లక్షలు నగదు,11 మద్యం బాటిళ్లు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ పుల్లయ్య తెలిపారు. చోరీ ఘటన తెలుసుకున్న సెబ్ అధికారి ఘటనాస్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పట్టపగలే చోరీ

ప్రజాశక్తి- చిలమత్తూరు

మండల పరిదిలోని మరవకొత్తపల్లి బీసి కాలనీలోని ఇంట్లోకి పట్టపగలే గుర్తు తెలియని దుండగు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు శంకర్‌రెడ్డి తెలిపిన వివరాలు... మంగళవారం శంకర్‌రెడ్డి ఇంటినుంచి పనిమీద బయటకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న శంకర్‌రెడ్డి భార్య స్నానం చేయడానికి బాత్‌రూంలోకి వెళ్లింది. గమనించిన దుండగులు బాత్‌రూం బయట గొళ్లెం పెట్టి ఇంట్లోకి చొరవడి 10 తులాలు బంగారును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఈరన్న తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని పలు ప్రాంతాలలో ద్విచక్రవాహనాలను దొంగలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈమేరకు నిందితుల అరెస్టు వివరాలను మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన గుర్రం పాటి రాకేశ్ రణదీప్, మేకల నరసింహులు, నీలీసతీష్ కుమార్ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే వీరు చెడు వ్యసనాలకు అటువాటు పడ్డారు. కూలిపనులు చేసుకుంటూ వచ్చేసంపాదన చాలక ఎలాగైన సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలకు అలవాటు పడ్డారు. 2022 ఏప్రిల్ 25న ధర్మవరం పట్టణంలో మాధవనగర్, సాలేవీధి, రాఘవేంద్రస్వామి పంక్షన్‌హాల్, పీఆర్‌టీ వీధి తదితర ప్రదేశాలలో ఇంటి ముందు ఉంచిన ఏడు టీవీఎస్ ఎక్స్‌ఎల్, ఒక అప్పాచీ ద్విచక్రవాహనాన్ని దొంగతనం చేశారు. ఈ క్రమంలో శివానగర్లోని శివాలయం వద్ద కొందరు అనుమానంగా ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీఉకుని విచారించగా ద్విచక్రవాహనాల చోరీ గురించి అంగీకరించారు. నిందితుల్లో గుర్రంపాటిరాకేశ్ రణదీప్, నీలీసతీశ్ కుమార్‌ను అరెస్టు చేశామని మరో నిందితుడు మేకల నరసింహులును త్వరలో పట్టుకుంటామని సిఐ చెప్పారు. మొత్తం 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసు ఛేధించిన సిఐ సుబ్రమణ్యం, ఎఎస్ఐ పుట్టప్ప, కానిస్టేబుళ్లు వెంకటేశ్, బయన్న, అబ్దుల్లా, ఆదినారాయణ, నాగేశ్వర్‌ను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం

ఇనుము చోరీ కేసులో వైసిపి నాయకుడు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

హంద్రీనీవా కెనాల్ పనులకు సంబందించిన ఇనుమును చోరీ చేసిన కేసులో తలుపుల మండలం కుర్లికి చెందిన వైసిపి నాయకుడు శివారెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. అరెస్టుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తలుపుల మండలం కుర్లికి చెందిన శివారెడ్డి కుర్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కెనాల్ పనులకు సంబందించిన ఇనుమును సంబంధిత వారిని బెదిరించి దోచుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. 2022 జనవరి 9న ఈ చోరీ జరిగిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శివరారెడ్డిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కదిరి రూరల్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ వెంకటేశ్వర్లు, తలుపుల ఎస్ఐ జి.దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్టు చేసిన అతని నుంచి 1610 కేజీల ఇనుప కడ్డీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మంత్రిని కలిసిన 'సామకోటి'

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం కలిశారు. విజయవాడలోని సెక్రెటరీయట్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాటమయ్య, తిరుపాలు, బెల్ల నాగేంద్ర, వెంకట శివప్ప, అంజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గ పరిధిలోని గుడిబండలోని సైనిక్ వర్ష పాఠశాల నిబంధనలు పాటించడం లేదని అధికారులు విచారణ జరిపి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి బండలో గత కొంత కాలంగా నవోదయ కోచింగ్ సెంటర్ అని పెట్టి వ్యాపారం మొదలు పెట్టిన యాజమాన్యం నేడు ఏకంగా ఒక ప్రయివేటు విద్యా వ్యాపార సంస్థనే స్థాపించిందన్నారు. సైనిక్ వర్ష పాఠశాల అనే పేరుతో పాఠశాల ను ప్రారంభించి వ్యాపారం చేస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాల్సిన ఎంఇఒ చూసీచూడనట్లు వ్యవహరిస్తూ అనుమతి ఇచ్చేశారని విమర్శించారు. ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి ఆ పాఠశాల అనుమతి రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పునీత్, శివ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని సిద్ధరామపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు జయశంకర్ గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

లెదర్‌పార్కులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - మడకశిర

చర్మకారుల ప్రయోజనార్థం రాష్ట్రంలో లెదర్‌పార్కులు ప్రారంభించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్. హనుమంతు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మలుపు పథకాన్ని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పటిప్రభుత్వం తిరిగి ఆ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. ప్రధానంగా మడకశిర మండలంలో సెజ్ పేరుతో ఇది వరకే సేకరించిన భూముల్లో 500 ఎకరాలు మేఘా లెదర్ పార్క్‌కు కేటాయించి మేఘా లెదర్ పార్క్ మంజూరు చేయించేందుకు స్థానిక శాసన సభ్యులు కృషి చేయాలని కోరారు.

గుడిసెలు తొలగించిన చోటే పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల కేంద్రంలోని చింత తోపు సమీపంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించారని అదే చోటే పేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్ చేశారు. చింతతోపు సమీపంలో సర్వే నెంబర్ 700 లో సుమారు 8 నెలలుగా వందమంది తాత్కాలిక గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. అయితే అధికారులు మంగళవారం తెల్లవారుజామున ఆ గుడిసెలను తొలగించారు. దీంతో సిపిఐ జిల్లా కార్యదర్శి తొలగించిన గుడిసెల ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. బాధితులతో కలిసి సోమందేపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. దౌర్జన్యంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరైనది కాదని అన్నారు. ఈ విషయంలో అధికారులపై కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలాస్వామి, చాంద్ బాషా, వినోద్ కుమార్, కాటమయ్య బాధితులు తదితరులు పాల్గొన్నారు.